# వచ్చే మూడు దశాబ్దాలూ వెక్టర్ డేటాబేస్ లదే



- **గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పేర్కొన్న మాజీ ప్రొఫెసర్ సి.రాఘవేంద్రరావు**

**పటాన్ చెరు, నవంబర్ 5, (సిరి న్యూస్)** : రాబోయే మూడు దశాబ్దాలు వెక్టర్ డేటాబేస్ లకు చెందుతాయని, అభివృద్ధి చెందుతున్న డేటా ప్రపంచంలో అందుకు అనుగుణంగా ఉండటానికి గణితం పై పట్టు సాధించాలని హైదరాబాదు విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ సి.రాఘవేంద్రరావు సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణితం, గణాంకాల విభాగం ఆధ్వర్యంలో 'వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో డేటా సైన్స్ పాత్ర' అనే అంశంపై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ప్రొఫెసర్ రావు సైన్స్ సారాంశం, గణితం పాత్ర, డేటా ఆధారిత సమస్య పరిష్కారానికి పెరుగుతున్న ఔచిత్యం గురించి ఆలోచించమని విద్యార్థులను ప్రేరేపించారు. 'అవసరం ఆవిష్కరణకు తల్లి' అని చెబుతూ, ట్రాఫిక్ అంచనాలు, మౌలిక సదుపాయాల ప్రణాళిక, నిర్ణయం తీసుకోవడం వంటి సంక్లిష్ట సవాళ్లను గణిత మోడలింగ్, డేటా సైన్స్ ఎలా పరిష్కరించగలవో ఆయన వివరించారు. శాస్త్రీయ నమూనాల పరిణామం, అంతర్ విభాగ నైపుణ్యాల ప్రాముఖ్యత, డేటా విశ్లేషణలో గణిత కఠినత యొక్క ఆవశ్యకత గురించి ప్రొఫెసర్ రావు చర్చించారు. డేటా శాస్త్రవేత్తలకు అవసరమైన నైపుణ్యాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఓపెన్-మైండెడ్ నెస్, మోడలింగ్, కమ్యూనికేషన్, విజువలైజేషన్, ఆప్టిమైజేషన్ పద్ధతుల విలువను వివరించారు. వాస్తవ ప్రపంచ సవాళ్లు, విశ్లేషణాత్మక పరిష్కారాల మధ్య వారధిగా గణిత నమూనా తయారీ యొక్క ప్రాముఖ్యతను ప్రొఫెసర్ రావు నొక్కి చెప్పారు. పరిశోధనా ఫలితాలలో ధ్రువీకరణ, స్థిరత్వం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, రాబోయే మూడు దశాబ్దాలు వెక్టర్ డేటా బేస్ లదే అని పునరుద్ఘాటించారు. ఎం.ఎస్సీ డేటా సైన్స్ విద్యార్థులు చిన్న పరిశోధన ప్రాజెక్టులను చేపట్టాలని, ఆవిష్కరణ, వ్యవస్థాపకతకు అవకాశాలను గుర్తించడానికి భారతదేశం విజన్ డాక్యుమెంటు 2047 ను అధ్యయనం చేయాలని ఆయన ప్రోత్సహించారు. తొలుత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి అతిథిని స్వాగతించగా, ప్రొఫెసర్ బీ.ఎం. నాయుడు, డాక్టర్ జాదవ్ గణేష్ ప్రొఫెసర్ రాఘవేంద్రరావును సత్కరించారు.



# వైభవంగా పార్వతి సమేత సంగమేశ్వర స్వామి కళ్యాణం

- **పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్**

**ఝరాసంగం నవంబర్ 5 సిరి న్యూస్)** : పవిత్ర కార్తీక మాసం పౌర్ణమినాడు బుధవారం శైవ క్షేత్రమైన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ సంగమేశ్వర స్వామి కళ్యాణం కమనీయంగా జరిగింది. స్వామి వారి కళ్యాణానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తూ భక్తుల సమక్షంలో స్వామి వారి కళ్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణంలో పాల్గొనడానికి భక్తులు మన రాష్ట్రంతో పాటు కర్నాటక,మహారాష్ట్రల నుండి తరలి వచ్చారు. మేడ్చల్ జిల్లా సీనియర్ సివిల్ కోర్ట్ అడిషినల్ జడ్జి ఎం. అర్జున్, సంగారెడ్డి



జిల్లా అడిషినల్ జూనియర్ జడ్జి కె.ధనలక్ష్మి స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు.



అనంతరం అర్చకులు గర్భగుడి వెనుకాల గల అమృత గుండంలో గంగాహారతి ఇచ్చారు. భక్తులు ఆలయ ప్రాంగాణంలో కార్తీక దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. ఆలయానికి వీఐపీల రాకతో భక్తుల దర్శనానికి ఇబ్బంది కలిగింది. గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మెదక్ జడ్పి సీఈఓ సీహెచ్ ఎల్లయ్య, డీఎస్పీ సైదానాయక్, సీఐ హన్మంతు, ఎస్ఐ క్రాంతికుమార్, ఆలయ ఈఓ శివరుద్రప్ప, పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటీల్, ధర్మకర్తలు మల్లికార్జున్,నవాజ్ రెడ్డి, మల్లయ్యస్వామి, వి.మల్లప్ప, భక్తులు పాల్గొన్నారు.



# ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ





**అమీన్ పూర్, నవంబర్ 5, (సిరిన్యూస్)** :అమీన్ పూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి నివాసంలో వారి కుమారుడు తుమ్మల రుశ్వంత్ రెడ్డి కన్నె స్వామి ఆధ్వర్యంలో మాన్యశ్రీ కేశవ్ గురుస్వామి కరకములాలతో కార్తీక పౌర్ణమి రోజు అయ్యప్ప స్వామి మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. జంగిరెడ్డి గురు స్వామి భజన భక్తి పాటలు ప్రత్యేక ఆకర్షణతో వందలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో పూజ స్థలం మారు మొగింది. అయ్యప్ప స్వామికి 18 పడి మెట్ల ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అయ్యప్ప స్వాములు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిషేధానికి రేషన్ బ్యాగుల పంపిణీ

- **ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి**



**గుమ్మడిదల, నవంబర్ 5 (సిరి న్యూస్)** :ప్లాస్టిక్ వ్యవస్థ నిర్మూలించేందుకు రేషన్ బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో చేపట్టిందని పటాన్ చెరువు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా రేషన్ బియ్యం సరుకుల బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ దుకాణాల ద్వారా అర్హత గల అందరికీ సన్న రకం బియ్యం పంపిణీ చేయడంతో కడుపునిండా తింటున్నారని అన్నారు గతంలో రేషన్ బియ్యం రేషన్ దుకాణాల నుండి నేరుగా అమ్మకాలకు చేపట్టే వారిని కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీతో కడుపు నింపుకుంటున్నారని అన్నారు. ఈ ప్లాస్టిక్ వల్ల అనారోగ్యాలకు గురికావద్దనే ఉద్దేశంతో రేషన్ బియ్యం సరుకుల బ్యాగులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.తాజా మాజీ ఉప సర్పంచ్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చాకలి చంద్రయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆగం రాజు, నీరుడి నర్సింలు, కుమ్మరి శివ, తోలు ఎల్లయ్య, లక్ష్మాపురం బిక్షపతి, కొక్కొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ సభ్యులకు డీఎస్పీ ఐడీకార్డుల పంపిణీ



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబరు 5 (సిరి న్యూస్)** : సంగారెడ్డి జిల్లా రిటైర్డ్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి ఎల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య, సంగారెడ్డి రూరల్ సిఐ యూనియన్ ఆఫీసులో రిటైర్డ్ పోలీస్ సభ్యులకు ఐడి కార్డులను అందజేశారు. అనంతరం డి.ఎస్.పి మాట్లాడుతూ రిటైర్డ్ పోలీసులకు ఏదైనా సహకారం అవసరం అయినచో ఎలా వేళల మీకు సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విట్టల్ సార్ గౌవవ సభ్యులు జెనరల్ సెక్రెటరీ మహేష్, జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్ రావు, విజయ్ ప్రకాష్జీ, వన్ మల్లికార్జున్, ఈశ్వరయ్య, మాణిక్ రెడ్డి, నర్సింలు, సురేష్, యదాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.